క్లుప్తంగా

ఘనంగా ఇరుముడి పూజ



ఇరుముడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: మండల కేంద్రం అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన అయ్యప్పస్వాముల ఇరుముడి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరయ్యారు. సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్‌నాయక్, మధు, నాగేంద్ర, లక్ష్మీకాంతతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు ఇరుముడితో కేరళ రాష్ట్రంలో వెలసిన అయ్యప్పస్వామి దర్శనం కోసం ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని ఉపార్లపల్లి, వంటిపాళ్యం గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

అమరాపురం: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల సచివాలయం ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కెంకెర గ్రామంలో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలోని కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క సచివాలయం కన్వీనర్ ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ప్రజల్లో మమేకం కావాలని సూచించారు. అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా చూడాలన్నారు.

వాల్మీకి జాతరకు తరలిరండి

పావగడ: చిత్రదుర్గం జిల్లా రాజనహళ్లి వాల్మీకి ఆశ్రమంలో వచ్చే నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న మహర్షి వాల్మీకి జాతరకు తాలూకాలోని వాల్మీకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని రాజనహళ్లి ఆశ్రమ పీఠాధిపతి వాల్మీకి ప్రసన్నానందపురి స్వామి పిలుపు నిచ్చారు. స్థానిక అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన వాల్మీకుల సమావేశంలో స్వామిజీ మాట్లాడారు. ఎస్సీ ఎస్టీలు సంఘటితం కావాలని అప్పుడే ప్రభుత్వాలు దిగి వచ్చి రిజర్వేషన్ సౌలభ్యాలు ఇంటి వద్దకే అందిస్తాయన్నారు. రాజ్యాంగం ఫలితాలు ఎస్సీ,ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు అందకుండా, అగ్ర కులాలకు అందేలా పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ పెంపు కోసం దీక్ష చేపట్టి డిమాండ్లు సాధించిన వాల్మీకి ప్రసన్నానందపురి స్వామీజీని నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిడుగల్ వాల్మీకి సంజయకుమారస్వామి, పాళేగార్ లోకేశ్, చిత్తగానహళ్లి చంద్రు, నాని, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

గుడిబండ: మండల ఎస్‌ఐగా అన్నెం మునిప్రతాప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యాలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. అనంతరం సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల నుంచి బదిలీపై ఆయన గుడిబండ వచ్చారు.

తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల బీమా

హిందూపురం టౌన్: తపాలాశాఖ ఇటీవల అమలులోకి తీసుకువచ్చిన ప్రమాద బీమా పాలసీ తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా రక్షణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ బాల సత్యనారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలోని బాపూజీనగర్‌లో ప్రేమ్‌కుమార్ 67వ జయంతి, వెంకటప్ప 24వ వర్ధంతి సందర్భంగా విమల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ 200 కుటుంబాలకు ప్రమాద బీమాను చెల్లించారు. ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.79,800ను పోస్టల్‌శాఖకు చెల్లించారు. అనంతరం ఇన్సూరెన్స్ బాండ్లను పాలసీదారులకు పంపిణీ చేశారు. కేవలం రూ.399తో రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ అందిస్తున్నట్లు బాలసత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ కృష్ణ, పోస్టుమాస్టర్లు సరోజ్‌కుమార్, మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బాబయ్య దర్గా



బాబయ్య దర్శనానికి వచ్చిన భక్తులు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య స్వామి దర్గా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతితో పాటు సెలవు దినాలు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్గాకు వచ్చారు. దర్గాలో బాబయ్య స్వామికి ప్రత్యేక ప్రార్థనల తర్వాత పేదలకు అన్నదానంతో పాటు ఆర్థిక సాయం అందించారు.



లేపాక్షి: ఎద్దుల బండ్లతో ఊరేగింపు



లేపాక్షి: కొండూరులో దప్పు, ఉర్రాల పోటీ జరుగుతున్న దృశ్యం

సందడిగా సంక్రాంతి

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా అన్ని చోట్లా ముగ్గుల పోటీలను నిర్వహించడంతో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో క్రీడలు ఆడుతూ యువకులు ఉత్సాహంగా గడిపారు. కొన్నిచోట్ల గోవులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

– సాక్షిబృందం



హిందూపురం: అలంకరణలో పేట వెంకటరమణస్వామి



హిందూపురం: లక్ష్మీ సమేత హయగ్రీయ స్వామి



చిలమత్తూరు: ఓ ఇంటి ముందు వేసిన అందమైన ముగ్గు



పరిగి: పెద్దిరెడ్డిపల్లిలో రైతు కుటుంబం ముగ్గు వేసిన దృశ్యం



హిందూపురం: సంతేబిదనూరులో ఎద్దులను అలంకరించిన దృశ్యం



అమరాపురం: ముగ్గు దగ్గర పూజ చేస్తున్న చిన్నారి



రొద్దం: చెక్కభజన పోటీ నిర్వహిస్తున్న దృశ్యం



పావగడ: గోపూజలో పాల్గొన్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు



మడకశిరరూరల్: వేణుగోపాలస్వామి చుట్టూ గో ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంకరనారాయణ



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మహదేవమ్మ, వీరిది సోమందేపల్లి మండలం చాలకూరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు పథకాల ద్వారా రూ.1,54,665 లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. జగన్న వసతి దీవెన ద్వారా రూ.45,180 జగన్న విద్యా దీవెన ద్వారా రూ. 37,799, వైఎస్సార్ చేయూత కింద రూ. 18,750, పంట బీమా ద్వారా రూ.16,014, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ. 15 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.18,584 చొప్పున లబ్ధి పొందారు. పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు అందిస్తున్నారని, సీఎం జగన్ మేలును మరువలేమని మహదేవమ్మ హర్షం వ్యక్తం చేశారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చాలకూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడప వద్దకే వచ్చి పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేదని తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయంతో పాటు మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్ లలితా, ఎంపీటీసీ నందిని, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు లక్ష్మీనరసప్ప, దాసులప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, శివప్ప, షఫీ, పరంధామ, హనుమంతు, కిష్ట, రామాంజినప్ప, జయకృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: మండలంలోని ఈదుకబలాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకు చెందిన 20 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ డీలర్ సూరప్ప, నాగేంద్ర, గంగాధర్, గోవిందమ్మ, మురళి తదితరులకు ఎమ్మెల్యే శంకరనారాయణ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అశోక్, సింగిల్ విండో చైర్మన్లు ఆదినారాయణరెడ్డి, కొల్లప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నియంత్రణకు సహకరించండి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీఐ అజయ్ సారథి

పావగడ: మట్కా , పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను తుద ముట్టించేందుకు ప్రజలందరూ పోలీస్‌శాఖకు సహకరించాలని సీఐ అజయ్ సారథి సూచించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని తాలూకాలోని బ్యాడనూరు గ్రామంలో నమ్మ పావగడ... నమ్మ హెమ్మె క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా నుంచి అనేక పేద కుటుంబాలు బజారు పాలయ్యాయని, పోలీసులు చేపట్టిన చర్యలతో ఇప్పటికే మట్కా, జూదం కొంత మేరకు తగ్గిందన్నారు. ఇంకా పూర్తిగా నిర్మూలించడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర క్యాలెండర్లను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో మానం శశికిరణ్, వేణు గోపాలరెడ్డి, బ్యాడనూరు శివు, ప్రకాశ్‌రెడ్డి, బేకరి నాగరాజు, నరసింహ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్ర మంత్రి, రాయలసీమ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. సోమవారం చౌళూరు రామకృష్ణారెడ్డి అభిమానులు, పార్టీ నాయకులు తిరుపతిలో మంత్రిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హిందూపురంలో పార్టీ పరిస్థితులను తెలియజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు, రంగనాథ్, రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ బాలచంద్ర, రాజు, అనిల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి, దాదాపీర్, చంద్ర, దాలప్ప తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఇబ్బంది పెడితే చర్యలు

లేపాక్షి: లేపాక్షిలోని నంది విగ్రహం సమీపంలో ఉన్న థీంపార్కు , నంది విగ్రహం, జటాయువు పక్షి విగ్రహం పరిసరాల్లో ఉన్న సోమవారం తోపుడు బండ్ల వ్యాపారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వ్యాపారాలు నిర్వహించుకునేందుకు పోటీ పడటంతో ఒకరినొకరు కుట్టుకునే ప్రయత్నం చేశారు. పర్యాటకులు ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకొని తోపుడు బండ్ల వ్యాపారస్తులను అక్కడి నుంచే పంపివేశారు. ఏఎస్‌ఐ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతానికి సంబంధించిన ఆవరణలో వ్యాపారాలు నిర్వహించకూడదని హెచ్చరించారు. పర్యాటకులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు.

అగ్నికి ఆహుతైన గుడిసె



మంటల్లో కాలిపోతున్న గుడిసె

అమరాపురం: మండల పరిధిలోని నగోనపల్లి గ్రామానికి చెందిన సన్నకాటప్పకు చెందిన గుడిసె ఆదివారం అగ్నికి ఆహుతైంది. బాధితుడి వివరాల మేరకు.. సన్నకాటప్ప తనకున్న తోటలోనే గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలంలో పనులు చేసుకుంటుండగా ఉన్నట్టుండి గుడిసె నుంచి మంటలు రావడంతో ఆర్పడానికి ప్రయత్నం చేశారు. మంటలు వేగంగా వ్యాపించడంతో గుడిసె కాలిపోయింది. అందులో ఉన్న రాగులు, వేరుశనగకాయలు, బియ్యం, కందుల బస్తాలతో పాటు దుస్తులు, రూ.10 వేలు నగదు అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న గుడిసె కాలిపోవడంతో ఎక్కడ ఉండాలో కూడా అర్థం కావడం లేదని వాపోయారు. రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించిందన్నారు. జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు అంచనా వేసి ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

గోమతి గోశాలలో పూజలు

హిందూపురం టౌన్: గోవు ఎంతో శ్రేష్టమైదని, గో సంపదను కాపాడుకోవాలని గోమతి గోశాల సభ్యులు పిలుపునిచ్చారు. సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని గోమతి గోశాలలో గో పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించి గో పూజను చేశారు. కార్యక్రమంలో గోమతి గోశాల సభ్యులు దొంతి మహేంద్ర, లక్ష్మీనారాయణ, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలన్నీ పరిష్కరిస్తాం

పావగడ: రైతు సంక్రాంతి, రైతు చైతన్యం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి స్థానిక రైతు సంఘం నాయకులతో సోమవారం సాయంత్రం ఆంధ్రగిరి మీటింగ్ హాల్ వర్చువల్ పద్ధతిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు పూజారప్ప వివిధ సమస్యలను వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో జేడీఎస్ పార్టీని పూర్తి మెజారిటీతో గెలిపిస్తే రైతు సమస్యలన్నీ పరిష్కరిస్తామని కుమారస్వామి హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'హులికుంట'



ట్రోఫీ అందుకుంటున్న హులికుంట జట్టు సభ్యులు

రొళ్ల: మండల పరిధిలోని హులికుంటలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేతగా హులికుంట జట్టు నిలిచింది. మొత్తం 16 జట్లు టోర్నీలో పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రెండ్స్ జట్టుపై హులికుంట జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వాహకులు నర్సేగౌడు తదితరులు హులికుంట జట్టుకు ట్రోఫీ అందజేశారు.

ఏపీ రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాకవి యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ నరసింహారెడ్డి, కోకన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, పుష్పరెడ్డి, ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



ఎన్నికైన చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ నూతన కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని స్థానిక రాజధాని ఫంక్షన్ హాలులో చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షుడిగా సురువు రామాంజనేయులు, అధ్యక్షుడిగా చలపతి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేడికుర్తి హరి, కార్యదర్శిగా జయరామకృష్ణ, సహాయ కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా చంద్రశేఖర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.